

# 7. ఏరు నిద్దరోయింది

**పాఠంలోకి ప్రవేశించేముందు:**

అమాయకత్వానికి మరోపేరు పరమానందయ్య శిష్యులు. ఆ శిష్యులు చేసే పనులు నవ్వు తెప్పిస్తాయి. శిష్యులెంత తెలివి తక్కువగా ప్రవర్తించినా గురువుకు కోపంరాదు. సహనానికీ, శాంతానికీ మారు పేరే ఆయన. ఆయనకు శిష్యులంటే వల్లమాలిన ప్రేమ.

వీరి కథలే పరమానందయ్య శిష్యుల కథలు. ఇప్పుడు ఆ కథలలోని ఒక కథను చదువుదాం.

---

పరమానందయ్యగారికి శుభకార్యం జరపవలసి వచ్చింది. అందుకని చుట్టు పక్కల గ్రామాలకు వెళ్ళి, ధన, కనక, వస్తు వాహనాలు, విరాళాలు సేకరించుకు రావాలని శిష్యులు పన్నెండు మందిని వెంటబెట్టుకుని బయలుదేరారు. శిష్యులంటే వీరికి పంచ ప్రాణాలూ. వీరులేనిదే ఆయనుండలేరు. నాలుగయిదు గ్రామాలు తిరిగేసరికి వీరికి విరాళాలు బాగానే ముట్టాయి. అదికాక అప్పటికే సాయంత్రమయి పోయింది. తొందరగా మఠం చేరుకోకపోతే చీకటి పడిపోతుందని వాళ్లంతా గబగబ నడవసాగారు.

త్రోవలో ఏరు అడ్డమొచ్చింది. అది మోకాలిలోతు మాత్రమే ప్రవహిస్తుంది. దానిని చూసేసరికి నందుడికి కోపమొచ్చింది. "ఈ ఏటికేమయినా బుద్ధుందా? మా గురువుగారితో కలిసి శిష్యులం వస్తుంటే మా ప్రయాణం ఆపాలనే దుర్బుద్ధేమిటి దీనికి? గురువుగారన్నా భయం లేదు. మూటలు మోసుకుంటూ అలసిపోయి వచ్చామన్న ఆలోచన లేదు" అనుకుని "గురువుగారూ! మీరు హాయిగా విశ్రాంతి తీసుకోండి అంటూ గురువుగారికి విశ్రాంతి యిచ్చారు. పుల్లయ్యని పిలిచి కాగడా వెలిగించమన్నాడు." "ఎందుకూ? అడిగాడతను. "చురకెయ్యడానికి" "ఎవరికీ" "ఏరుకి"

అతను కాగడా తయారుచేసి మంట అంటించాడు. ఆ కాగడా పట్టుకుని నందుడు పిల్లిలా నిశ్శబ్దంగా ఏటిలోకి వెళ్లాడు. చటుక్కున ఆ కాగడాని ఏటి నీటిలో ముంచాడు. తక్షణం అది చుయ్‌మని శబ్దం చేసింది. ఆ శిష్యుడు త్రుళ్ళిపడి – బెదిరిపోయి... "బాబోయ్..." అంటూ పరుగెత్తుతూ... పడుతూ... లేస్తూ... గురువుగారి ప్రక్కన పడ్డాడు.

"ఏమయిందిరా?" అడిగాడు గోవిందం. "ఏరు నిద్దరోతుందేమో అని చురకెయ్యబోయానా? అది పడుకోలేదురేయ్........ మెలుకువగానే ఉంది. నేను వాతపెట్టబోతుంటే పగపట్టిన పాములా బుస్సుమని తన పెద్ద పెద్ద కెరటాలతో నన్ను కాటేసిందిరా. బతికుంటే బలుసాకు తినొచ్చని... చచ్చిపోతే అందరి మధ్యా ధైర్యంగా ఆనందంగా చద్దామని ప్రాణాలకి తెగించి పరుగెత్తుకొచ్చేసేనురా".. అంటూ వణికిపోతూ... భోరుమని ఏడిచేశాడు. అతని వళ్లంతా చెమటలు పట్టేసింది.

అప్పుడటునుంచొక యువకుడు గుర్రం మీద స్వారి చేస్తూ ఏరుదాటడం చూసిన వారి ఆశ్చర్యానికి మేరలేకపోయింది. "ఎంత ధైర్యంగా ఎంత నేర్పుతో వస్తున్నాడో! ఏరు నిద్దరోతూంది కామోసు. వాడినేమీ అనలేదు" – అనుకుని – 'ఇదే మంచి తరుణం. ఏరు నిద్దరోతూందేమో చూసిరా. మనమూ యిదే సందని దాటేద్దాం' అన్నాడు పుల్లయ్య.

ఏరు నిద్రపోతూందేమో చూసిరావడానికి నందుడు అడుగులో అడుగేసుకుంటూ నిశ్శబ్దంగా ఒడ్డుకి వెళ్ళాడు. మెల్లగా.. చప్పుడు చేయకుండా... తన చేతిలోని కాగడాను ముంచాడు. కాగడాకి నిప్పు లేదు కనుక నీళ్ళు ఏ శబ్దము చేయలేదు. ఏటి నుంచి ఏ శబ్దము రాకపోయేసరికి తను పరుగు పరుగున తనవారి దగ్గరకొచ్చి – ఏరు నిద్దరపోతూంది. ఇదే సమయం. మనం దాన్ని దాటెయ్యాలి. అందరూ తయారవండి" అని హడావుడి చేశాడు.

ఎలాగైతేనేం మూటలన్నీ తీసుకుని సముద్రం దాటినంత హడావుడి చేసి పరమానందయ్య శిష్యులు అవతలి ఒడ్డు చేరారు.

అప్పుడు – గోవిందుడు హఠాత్తుగా కేకవేశాడు.

''ఆగండొరేయ్-గోల చేయకండి అందరూ వరుసగా నిలబడండి. అందరూ నిశ్శబ్దమై వరసలో నిలబడ్డారు.

''ఎందుకు?'' అని అడిగాడు. పుల్లయ్య

''నాకనుమానంగా ఉంది.''

''ఏమానుమానం? దేని గురించి?''

''మనం అందరమూ యివతలి ఒడ్డుకి వచ్చామో, లేదో అనా'' ఐతే యిప్పుడేం చెయ్యాలి?'' మనం పన్నెండుమందిమి కదా! ఉన్నామో లేదో లెక్కెట్టుకుందాం ''ఆ'' ''లెక్కెట్టుకుందాం'' అని అతను ఒక్కొక్కరిని లెక్కెట్టడం మొదలు పెట్టాడు. పదకొండుమంది వచ్చారు.

''బాబోయ్.. ఒకళ్ళు తక్కువస్తున్నార్రోయ్'' గావు కేక పెట్టాడతను.

''అవతలి ఒడ్డున ఉండిపోయాడేమో''

''లేదు. నేను వెనక్కు తిరిగి చూశాను కదా చివరిసారి..''

''మరయితే ఏమయ్యాడు?

''ఏరు మింగేసిందన్నమాట''

''ఆ మాట చెప్పేసరికందరూ భోరున ఏడుస్తూ శాపనార్థాలు పెట్టసాగారు''.

ఆవైపుగా వస్తున్న ఒకరైతు ఇది చూశాడు. సంగతి ఏమిటా అని ఆరా తీసాడు.

మీ వాడిని నేను బ్రతికిస్తాను అంటూ కర్రతో నేలమీదొక గీత గీశాడు.

మీరొక్కక్కరు ఒకటి... రెండు... మూడు అని అంకెలు చెప్తూ ఈ గీతని దాటండి అన్నాడు.

మొదటి వాడు ఒకటి.. రెండవ వాడు ... రెండు అంటూ చివరివాడు పన్నెండు అని గీత మీద నుంచి దాటారు. శిష్యుల ఆశ్చర్యానికి అంతులేదు.

తమ స్నేహితుడు తిరిగి వచ్చాడన్న ఆనందంతో ఉన్న మూటలన్నీ రైతుకి సమర్పించి నమస్కారాలు పెట్టారు.

ఆ తర్వాత నిద్ర నుంచి మేల్కొన్న గురువుగారు విషయం తెలుసుకున్నారు. వాళ్ళ తెలివి తక్కువ తనానికి నెత్తి కొట్టుకున్నారు.

---

## I. వినండి-సంభాషించండి.

1. మీరు చదివిన హాస్య కథల పేర్లు తెలపండి.
2. తెనాలి రామకృష్ణుని గూర్చి విన్నారా? ఒక కథను చెప్పండి.
3. సినిమాలు, సర్కస్‌లలో హాస్య సన్నివేశాలను చూపించడానికి కారణం ఏమిటి?

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### అ. పదజాలం పెంపొందించుకుందాం.

విరాళాలు = చందాలు; తరుణం = అవకాశం; దుర్బుద్ధి = చెడ్డబుద్ధి; తక్షణం = వెంటనే;
ఆరాతీయు = గుట్టు తెలుసుకొను.

### ఆ. చర్చించండి-రాయండి.

1. పరమానందయ్యగారు చుట్టు ప్రక్కల గ్రామాలకు వెళ్ళడానికి కారణం.
2. కాగడా శబ్దం చేయక పోవడానికి కారణం.
3. శిష్యులు ఏరు దాటిన విధం.
4. రైతు శిష్యులతో అన్న విషయం.
5. నందుడికి కోపం రావడానికి కారణం.
6. గోవిందుడు లెక్కపెడదామనడానికి కారణం.
7. రైతు శిష్యులను ఆశ్చర్యపరిచిన విధం.
8. ఏరు నిద్దురోతుందని శిష్యుడు నిర్ధారించడానికి కారణం.

**III. కృత్యం:**

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.**




**అ. తప్పు, ఒప్పులను గుర్తించి రాయండి.**

1. తన చేతిలోని కాగడాను ముంచాడు. ( )
2. పరమానందయ్య శిష్యులు అవతలి ఒడ్డు చేరారు. ( )
3. ఏరు నిద్దరోతుందేమో చూసి రావడానికి పుల్లయ్య వెళ్ళాడు. ( )
4. కాగడాకి నిప్పు ఉన్నది కనుక నీళ్ళు ఏ శబ్దము చేయలేదు. ( )

'అప్పుడటునుంచొక యువకుడు ...... అవతలి ఒడ్డు చేరారు' వరకు.

**ఆ. సొంత వాక్యాల్లో ఉపయోగించి రాయండి.**

1) హడావుడి చేయు 2. అడుగులో అడుగు వేయు.

**ఇ. స్వీయస్పందన:**

ఏరు నిద్దరోతుందని నందుడు గ్రహించిన విధం మీ సొంత మాటల్లో రాయండి.

**IV. భాషావగాహన:**

**అ. కింది వాక్యంలోని గీతగీయబడిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.**

1. నేను వెనక్కు తిరిగి చూశాను.

| నేను | చూశాను |
|---|---|
| | |

2. కింది పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

| అప్పుడు | గోవిందుడు | హఠాత్తుగా | కేకవేశాడు |
|---|---|---|---|
| | | | |

**ఆ. కింది వాక్యాలలో గీతగీయబడిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.**

1. వీరికి విరాళాలు బాగానే ముట్టాయి. [ ]
2. మీ వాడిని నేను బ్రతికిస్తాను. [ ]

**ఇ. కింది వాటిలో సామాన్య, సంయుక్త వాక్యాలు గుర్తించండి.**

1. కాగడానికి నిప్పు లేదు కనుక నీళ్ళు ఏ శబ్దము చేయలేదు. [ ]
2. నందుడు నిశ్శబ్దముగా ఏటిలోనికి దిగాడు. [ ]
3. పరమానందయ్యగారు ధన, కనక, వస్తు, వాహనాలు సేకరించారు. [ ]

**V. సృజనాత్మకత:-**

1. నీకు తెలిసిన ఇతర భాషలలోని (హిందీ, ఇంగ్లీషు, మరాఠీ) హాస్యకథలను తెలుగులోకి అనువదించు.
2. హాస్యాన్ని కలిగింపజేసే కొన్ని చిత్రాలను సేకరించి ఆల్బమ్ వలె తయారు చేయండి.

**ఉపాధ్యాయులకు సూచన:** హాస్యకథలను చదివి వినిపించండి. వాటిలోని రసాస్వాదన గ్రహించునట్లు చూడండి.